సాక్షి యాదాద్రి భువనగిరి

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



బోనమెత్తిన పల్లెలు

జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. - 9లో



సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం నాయకులు విమర్శించారు. - 9లో



తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక

బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు మాతం ప్రదర్శన

భువనగిరిటౌన్ : షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో సోమవారం భువనగిరిలో మాతం ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 4గంటలకు ఖిలా పీర్ల చావడి నుంచి జంప్‌ఖానగూడెంలోని హజ్రత్ అబ్బాస్ పీర్ల కొట్టం మీదుగా, ఖాజీ మోహల్లా బీబీ కా అలావా పీర్ల చావడి వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. షియా మౌల్వి షాస్ అబ్బాస్ నఖ్వీ ధార్మిక ప్రసంగం చేస్తారని, ప్రదర్శనకు హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున షియా ముస్లింలు తరలివస్తారని పేర్కొన్నారు.

లక్ష్మక్కపల్లి వాసికి ఉత్తమ మహిళా రైతు అవార్డు



తారాదేవికి అవార్డు అందజేస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు

రాజాపేట : మండలంలోని లక్ష్మక్కపల్లికి చెందిన నారెడ్డి తారాదేవి ఉత్తమ మహిళా అవార్డు అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తొమ్మిదో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తారాదేవిని ఉత్తమ మహిళా రైతుగా ఎంపిక చేశారు. ఆదివారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు అవార్డుతో పాటు రూ.10వేల నగదును ప్రోత్సాహకాన్ని యూనివర్సిటీ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఏరువాక శాస్త్రవేత్తలు మధుశేఖర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై వాహనాల రద్దీ




చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు, వివాహాది శుభకార్యాలు కూడా పెద్ద ఎత్తున ఉండడంతో ప్రజానీకం రాకపోకలు సాగించే క్రమంలో వాహనాల రద్దీ పెరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు రద్దీ కొనసాగింది. చౌటుప్పల్‌లో వారం తపు సంత ఉండడంతో వాహనదారులు, ప్రజలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్‌స్టేషన్, ఇతర ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడాయి.

భావితరాలకు ప్రేరణగా దొడ్డి కొమురయ్య చిత్రం

భువనగిరి : దొడ్డి కొమురయ్య పోరాటాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని సినీ దర్శకులు ఎం.సేనాపతి అన్నారు. భావి తరాలకు ప్రేరణగా ఉండే విధంగా దొడ్డి కొమురయ్య సినిమా చిత్రీకరణ జరుగుతుందన్నారు. ఆదివారం భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కుల సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ వాతావరణం, నాటి పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా దొడ్డి కొమురయ్య చిత్రం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దర్శకునికి కుల సంఘాల నాయకులు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం దొడ్డి కొమురయ్య సినిమా నిర్మాణ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా శెట్టి బాలయ్య యాదవ్‌ను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో మందుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జెల్లి యాదగిరి, జెడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు పుట్ట వీరేశం యాదవ్, శెట్టి బాలయ్య, తాడూరి అంజయ్య, సుధాకర్, బెల్లి చంద్రశేఖర్, కౌన్సిలర్ స్వామి, కృష్ణ, కిరణ్‌కుమార్, వెంకటయ్య, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



పోటీలకు హాజరైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం అండర్–14, అండర్–17 విభాగంలో ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 70 మంది పాల్గొనగా ఆరుగురు ఎంపికయ్యారు. వీరంతా హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ నాయకులు గిరిబాబు, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● యాదాద్రిలో విజయ్ దేవరకొండ



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న సినీ హీరో విజయ్ దేవరకొండ



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ తిరువీధిలో కిక్కిరిసిన భక్తులు

నృసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ పంచనారసింహులకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజ వాహనసేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

విస్తరిస్తున్న ఎయిమ్స్!

మాస్టర్‌ప్లాన్ ప్రకారం పనులు

- పూర్తయిన ఆయుష్ ఆస్పత్రి భవనం
- ఆరు నెలల్లో మిగతా నిర్మాణాలన్నీ..
- వచ్చే సంవత్సరం నుంచి అందుబాటులోకి మరిన్ని వైద్యసేవలు
- విద్యార్థులు, ఉద్యోగులకూ తీరనున్న వసతి సమస్య



ఎయిమ్స్‌లో కొనసాగుతున్న భవన నిర్మాణాలు

సాక్షి, యాదాద్రి : బీబీనగర్ ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో చేపట్టిన వివిధ విభాగాలకు చెందిన భవన నిర్మాణాల పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆయుష్ వైద్యానికి సంబంధించిన భవనం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది.మిగతా వాటిని కూడా 2024 వరకు పూర్తయ్యేలా ఎయిమ్స్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,365 కోట్లు విడుదల చేసింది. భవనాలు అందుబాటులోకి వస్తే మరిన్న వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.దీంతోపాటు మెడికల్, నర్సింగ్ విద్యార్థులు, ఉద్యోగులకు వసతి సమస్య తీరనుంది.

రూ.1,365 కోట్ల వ్యయంతో పనులు

ఎయిమ్స్‌లో భవన నిర్మాణ పనులను రూ.1,365 కోట్లతో చేపట్టారు. 750 పడకల సామర్థ్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్ప త్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతి కోసం 24 అంతస్తుల్లో రెండు టవర్లు.. ఇలా మరెన్నో అత్యాధునిక సదుపాయాలతో రూపుదిద్దుకుంటుంది. ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం పనులు కొనసాగుతున్నాయి. భవన నిర్మాణాల పనులకు ఏప్రిల్ 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.

750 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

అత్యాధునిక వైద్యం, పూర్తిస్థాయిలో ఆరోగ్య, మౌలిక సదుపాయాల కల్పనకోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 750 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల అనుబంధ సంస్థల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. వైద్య విద్యనభ్యసించే విద్యార్థుల వసతి కోసం 24 అంతస్తుల్లో రెండు అత్యాధునిక టవర్లు నిర్మిస్తున్నారు.750 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, 300 మంది పీజీ విద్యార్థులు ఇక్కడ చదువు కోనున్నారు. వీరితోపాటు మరో 300 మంది సీనియర్.రెసిడెంట్ డాక్టర్లు ఉంటారు. డాక్టర్లు, లెక్చరర్ల థియేటర్, ఎగ్జామ్ హాల్, రీసెర్చ్ ల్యాబ్, 22 ఫ్యాకల్టీల రీసెర్చ్ ల్యాబ్‌లతో పాటు నర్సింగ్, పారామెడికల్ స్టాఫ్ వసతిగృహాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

2024లో ప్రారంభిస్తాం



2024లో అన్ని భవనాలు పూర్తి చేస్తాం. ప్రధాన భవనాల్లో ఒకటి పూర్తయ్యింది. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. గడువులోపు పూర్తిచేసి వైద్య సేవలను మరింత విస్తరిస్తాం. సెప్టెంబర్‌లో నర్సింగ్ కళాశాల ప్రారంభిస్తాం. ఫ్యాకల్టీలను నియమించాం. పారా మెడికల్ కోర్సును ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తాం. ఎంబీబీఎస్, ఎండీ, ఎమ్మెస్ కోర్సుల అడ్మిషన్లు తీసుకుంటాం.

– డాక్టర్ వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్



పూర్తయిన మొదటి భవనం లోపలి భాగం

24 రకాల భవనాలు

ఏయిమ్స్ ప్రధాన ఆస్పత్రి భవనం, న్యూ ఆస్పత్రి బ్లాక్, అకడమిక్ బ్లాక్, ఆడి టోరియం, ఆయూష్ బ్లాక్, రోగుల వెంట వచ్చే వారికోసం నైట్ షెల్టర్, మార్చురీ, డైరెక్టర్ రెసిడెన్సీ, గెస్ట్ హౌజ్ అండ్ క్లబ్, ఆరు రకాల క్వార్టర్స్, యూజీ బాలుర, బాలికల వసతి గృహాలు, పీజీ బాలుర, బాలికల వసతి గృహాలు, పీజీ వర్కింగ్ నర్సుల హాస్టల్, డైనింగ్ బ్లాక్, కమ్యూనిటీ బిల్డింగ్, సర్వీస్ బిల్డింగ్, అమృత్ ధార, అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్, ప్యానల్ రూం నిర్మాణం చేపట్టారు.



తుది దశకు చేరిన ఆయుష్ ఆస్పత్రి భవనం

డీఈఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్

భువనగిరి : ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు డీఈఓ నారాయణరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 9848026032 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అదే విధంగా ఈనెల 15వ తేదీన జరిగే టెట్ పరీక్షకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకునేందుకు హెల్ప్‌లైన్ నంబర్ 9010772080ను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, అభ్యర్థులు ఆయా నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పదోన్నతులు వచ్చేనా?

- ఏళ్లుగా పీఈటీలు, భాషా పండిట్‌ల ఎదురుచూపు
- కోర్టు తీర్పు కోసం నిరీక్షణ
- తాజాగా విద్యాశాఖ మంత్రిని కలిసి పదోన్నతులు కల్పించాలని వినతి



విద్యాశాఖ మంత్రికి వినతిపత్రం అందజేసిన పండిట్ పరిషత్ నాయకులు

భువనగిరి : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం రీషెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో తమకూ పదోన్నతులు కల్పించాలని పండిట్, పీఈటీలు కోరుతున్నారు. ఇందుకు సంబంధించి కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తూనే మరోవైపు ఇటీవల విద్యాశాఖ మంతి సబితా ఇంద్రారెడ్డిని కలిసి విన్నవించారు.

భాషా పండితులు, పీఈటీలు ఇలా..

భాషా పండిట్‌లు 191, పీఈటీలు 82 మంది ఉన్నారు. వీరికి 2015లో కామన్ సర్వీస్ ప్రకారం పదోన్నతులు కల్పించారు.అనంతరం ఎస్జీటీలు కూడా తమకు అర్హతలున్నాయని, పదోన్నతులు కల్పించాలని 2016లో హైకోర్టును ఆశ్రయించడంతో అప్పట్లో స్టే విధించింది. సాధారణంగా బీఈడీలో తెలుగు మెథడాలజీతో పాటు డిగ్రీలో తెలుగు చేసిన వారు గ్రేడ్–1 పండిట్‌లుగా ఉంటారు. టీపీటీ, హెచ్‌పీటీలు గ్రేడ్–2గా ఉన్నారు. గ్రేడ్–2 పండిట్‌లు 6,7,8వ తరగతులకు, గ్రేడ్–1 పండిట్‌లు 9,10వ తరగతులుకు బోధన చేయాలి. ప్రస్తుతం గ్రేడ్–2 భాషా పండిట్‌లను ఎస్జీటీ కేటగిరీలోకి మార్చి కేటగిరీ– 3లోకి కలిపారు. అప్పటి నుంచి వీరిని తెలుగు లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీటీ), హిందీ లాంగ్వేజ్ పండిట్ (ఎల్‌పీహెచ్)గా పరిగణిస్తున్నారు. గ్రేడ్–1 భాషా పండిట్‌ల కొరత వల్ల ఎస్జీటీ కేటగిరీలో చేర్చించి ఎల్‌పీటీ, ఎల్‌పీహెచ్‌లతో 9,10 తరగతులకు బోధన చేయిస్తున్నారు. గత 20 సంవత్సరాల నుంచి అదే విధంగా విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఎస్జీటీలు కోర్టులో వేసిన పిటిషన్‌తో పీఈటీల పదోన్నతులు నిలిచిపోయాయి.

పండిట్‌లకు న్యాయం చేయాలి

భాషా పండిట్‌లు 25 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా తమకు పదోన్నతులు ఇవ్వకుండా ఎస్జీటీలుగా ఉండి తర్వాత అర్హతలు సాధించిన వారికి ఎలా ఇస్తారు. మేము కూడా అర్హులమే. మాకూ పదోన్నతులు కల్పించాలి.

– అయితగోని వెంకటేశ్వర్లు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిట్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

అవకాశం కల్పిస్తారని నమ్మకం ఉంది

ఏడు సంవత్సరాలుగా పీఈటీలం పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నాం. పదోన్నతి కల్పించడానికి పీఈటీలకు అన్ని అర్హతలున్నాయి. కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందన్న ఆశ ఉంది.

– ఎస్.వెంకటరెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి

కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం

ప్రస్తుతం పదోన్నతులకు తాము అర్హులని భాషా పండిట్‌లు, పీఈటీలు అంటున్నారు. అయితే వీరికి అనుకూలంగా కోర్టు తీర్పు వెల్లడిస్తే ఉపాధ్యాయల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యే అవకాశం లేకపోలేదు.

అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు

- రాష్ట్రస్థాయి పురస్కారానికి నలుగురి ఎంపిక
- అభినందనలు తెలిపిన ఎంజీయూ వీసీ



అల్వాల రవి



ఎస్.దీపిక



సత్యనారాయణ



ఎ.శ్రీనివాసులు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని నలుగురు అధ్యాపకులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. ఎంజీయూలో ఎంబీఏ విభాగానికి చెందిన వీసీ ఓఎస్డీ అల్వాల రవి, నల్లగొండ ఎన్జీ కాలేజీ తెలుగు విభాగానికి చెందిన ఎస్.దీపిక, కెమిస్ట్రీ విభాగానికి చెందిన ఎ.శ్రీనివాసులు, ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కామర్స్ అధ్యాపకుడు సత్యనారాయణ రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి, సహచర అధ్యాపకులు వారికి అభినందనలు తెలిపారు.

ఆలేరు గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు

ఆలేరు రూరల్ : వచ్చే ఎన్నికల్లో ఆలేరు గడ్డపై కాషాయం జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుదర్‌రావు పిలుపునిచ్చారు. ఆలేరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరిగే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో శ్యాసుందర్‌రావు పాల్గొని మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గడగడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో విజయం కోసం కలిసికట్టుగా పని చేయాలని కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో యాదగిరిగుట్ట ఎంపీపీ పల్లె పాటి సత్యనారాయణ బీజేపీలో చేరనున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న ర్యాలీలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవులు, నాయకులు నరేందర్, జహంగీర్, రాఘవేంద్ర, కల్పన, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సకల హంగులతో సర్కారు బడి

- రూ.2 కోట్ల వ్యయంతో ఇస్కిళ్ల ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణం
- పూర్తి కావొస్తున్న పనులు
- మంత్రులచే ప్రారంభానికి సన్నాహాలు
- చేయూతనిచ్చిన సుమధుర ఫౌండేషన్ చైర్మన్ గుండా మధుసూదన్



కార్పొరేట్ తరహాలో రూపుదిద్దుకుంటున్న రామన్నపేట మండలంలోని ఇస్కిళ్ల ప్రాథమిక పాఠశాల

రామన్నపేట : మండలంలోని ఇస్కిళ్ల గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హైటెక్ హంగులతో రూపుదిద్దుకుంటోంది. 1నుంచి 7వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. హైదరాబాద్‌లో బిల్డర్‌గా స్థిరపడిన గ్రామానికి చెందిన గుండా మధుసూదన్ పాఠశాల స్థితిగతులు తెలుసుకున్నారు. మాతృభూమిపై ఉన్న మమకారంతో తాను స్థాపించిన సుమధుర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.2 కోట్ల వ్యయంతో పాఠశాల భవనాన్ని కార్పొరేట్ తరహాలో పునర్‌నిర్మిస్తున్నారు.

కొనసాగుతున్న నిర్మాణాలివే..

❖ 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్పొరేట్ సంస్థల భవనాలను తలదన్నే విధంగా ఇస్కిళ్ల పాఠశాల పనులు కొనసాగుతున్నాయి.

❖ ఏడు తరగతి గదులతో పాటు ప్రధానోపాధ్యాయుడి చాంబర్, స్టాఫ్‌రూం, డైనింగ్‌హాల్, స్టోర్ రూం, కిచెన్, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, సైన్స్, సాంఘిక శాస్త్రం ల్యాబ్‌లకోసం ప్రత్యేక గదులు నిర్మించారు.

❖ బ్లాక్‌ల మధ్య వాష్‌రూంలు ఏర్పాటు చేశారు.

❖ అధునాతన ఫర్నిచర్‌ను, కంప్యూటర్లు, కిచెన్ సామగ్రి కొనుగోలు చేశారు.

❖ ప్రీ ప్రైమరీ (అంగన్‌వాడీ) స్కూల్ పిల్లల కోసం రెండు ప్రత్యేక గదులు నిర్మించారు. చిన్నారుల కోసం ప్రత్యేక సామగ్రిని, ఆట వస్తువులు సమకూర్చారు.

❖ ప్రతీ గదిలో గ్రీన్ బోర్డులు, ఫ్యాన్లు, లైట్లు బిగించారు.

❖ ఆహ్లాదం, ఉల్లాసం కోసం గ్రీనరీతో పాటు రెండు క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నారు.

11న గ్రామస్తుల సమక్షంలో పూజలు

పాఠశాల పనులు తుది దశకు చేరాయి. ఈనెల 11వ తేదీన న గ్రామస్తుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం ప్రభుత్వ అధికారులు, మంత్రులను ఆహ్వానించి పాఠశాల ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పాఠశాలకు అవసరమైన ప్రతీ వస్తువును సుమధుర ఫౌండేషన్ వారే సమకూర్చడం విశేషం. నిర్మాణ పనుల పర్యవేక్షణ కోసం తన సంస్థకు చెందిన ప్రత్యేక బృందాన్ని నియమించారు.



తరగతి గదుల్లోకి డెస్క్ బెంచీలు



మధ్యాహ్న భోజనం కోసం వంట పాత్రలు

రుణపడి ఉంటాం



రూ.2కోట్లతో బడి కట్టించడం గొప్ప విషయం. హైదరాబాద్‌లో స్థిరపడినా సొంతూరికి సేవ చేస్తున్న గుండా మధుసూదన్‌కు, కుటుంబీకులకు గ్రామస్తులు రుణపడి ఉంటారు.

– బందెల యాదయ్య, సర్పంచ్, ఇస్కిళ్ల

హైటెక్ హంగులతో నిర్మాణం

పాఠశాలకు సుమధుర ఫౌండేషన్ మొదటినుంచి సహకారం అందజేస్తోంది. అవసరమైన అన్ని వస్తువులను నిర్వాహకులు సమకూరుస్తున్నారు. విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఇప్పుడు రూ.2 కోట్లతో హైటెక్ హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తుండడం హర్షణీయం.

–శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, ఇస్కిళ్ల

సంపాదనలో కొంత సమాజానికి



సంపాదనలో కొంత సమాజానికి ఇవ్వాలన్నదే తపన. అందుకోసం సుమధుర ఫౌండేషన్ స్థాపించి గ్రామస్తులకు దీర్ఘకాల ప్రయోజనాలు కలిగించే వనరులకు ప్రాధాన్యం ఇస్తున్నా. నా ఊరి పిల్లలు మంచి వాతావరణంలో చదువుకోవాలన్న సంకల్పంతో రూ.2కోట్లతో పాఠశాల భవనాలు నిర్మిస్తున్నా.

–గుండా మధుసూదన్,సుమధుర ఫౌండేషన్ చైర్మన్

క్లుప్తంగా

కోతుల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన సుజిత్‌ను ఎత్తుకున్న నాయినమ్మ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామానికి చెందిన కుంచం మహేష్ కుమారుడు కుంచం సుజిత్ ఆదివారం ఇంటి ఎదుట ఆడుకుంటుండగా ఓ కోతి అతడిపై దాడి చేసింది. ఇది గమనించిన సమీపంలోని కోతుల గుంపు కూడా ఒక్కసారిగా వచ్చి సుజిత్‌పై దాడి చేశాయి. చుట్టుపక్కల వారు గమనించి కోతులను దూరంగా వెళ్లగొట్టడానికి ప్రయత్నించగా వారి వెంట కూడా పడ్డాయి. దీంతో కొందరు కర్రలు పట్టుకొని రావడంతో కోతులు బాలుడిని వదిలేసి కొంతదూరం వెళ్లి ఆగాయి. గ్రామస్తులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గాయపడిన బాలుడిని అందులోకి ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మళ్లీ కోతులు వెనక్కి వచ్చి అంబులెన్స్ వద్ద ఉన్న వారందరిని చుట్టుముట్టాయి. కర్రలతో మళ్లీ వెంటపడగా కోతులు వెనుతిరిగి పోయాయి. గ్రామంలో కోతుల బెడద నుంచి అధికారులు రక్షించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

హైవేపై కొండచిలువ మృతి



మృతిచెందిన కొండచిలువ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ హైవేపై ఆదివారం కొండచిలువ మృతి చెందింది. గుండ్రాంపల్లి గ్రామ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నుంచి హైవే మీదకు వస్తున్న కొండచిలువ పైనుంచి గుర్తుతెలియని వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన కొండచిలువ సుమరు పదిహేను అడుగులకు పైగా ఉంది.

యువతి అదృశ్యం

చౌటుప్పల్: మండల పరిధిలోని దేవలమ్మ నాగారం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఆదివారం చౌటుప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేసే సదరు యువతి రోజు మాదిరిగా శనివారం కూడా పరిశ్రమకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్): జీవితంపై విరక్తితో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం తిరుమలగిరి మండల కేంద్రం పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన పగిడిమర్రి వెంకటేశ్వర్లు(26) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాలం కలిసి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు ఇవ్వాలని అడగడంతో జీవితంపై విరక్తితో ఆదివారం గ్రామ శివారులో పొలాల వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు తండ్రి పగిడిమర్రి సైదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

యాదాద్రి శిల్పకళా నైపుణ్యం అద్భుతం

- సినీ హీరో విజయ్ దేవరకొండ

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో శిల్పకళా నైపుణ్యం అద్భుతంగా ఉందని సినీ హీరో విజయ్ దేవరకొండ అన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని విజయ్ దేవరకొండతో పాటు అతడి సోదరుడు, హీరో ఆనంద్ దేవరకొండ, కుటుంబ సభ్యులు, ఖుషి సినిమా డైరెక్టర్ శివ నిర్వాణ, ప్రొడ్యూసర్లు రవి, నవీన్, సినిమా టీం సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు విజయ్ దేవరకొండతో పాటు కుటుంబ సభ్యులు, ఖుషి టీం సభ్యులకు ప్రత్యేక స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న విజయ్ దేవరకొండతో పాటు కుటుంబ సభ్యులకు, ఖుషి సినిమా యూనిట్ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈఓ గీత లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతర విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి ఆలయం అద్భుతంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో యాదాద్రి ఆలయాన్ని నిర్మించిందని ప్రశంసించారు. పదేళ్ల క్రితం డిగ్రీ చదువుతున్న సమయంలో యాదగిరిగుట్టకు వచ్చానని, మళ్లీ ఇప్పుడు యాదాద్రిలో శ్రీస్వామిని దర్శించుకున్నట్లు వెల్లడించారు. ఖుషి సినిమా సక్సెస్‌తో పాటు ఈ ఏడాది తమ కుటుంబానికి చాలా మంచి జరిగిందన్నారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామిని వేడుకున్నట్లు చెప్పారు. త్వరలోనే గీతాగోవిందం డైరెక్టర్‌తో కలిసి మరో సినిమా తీయబోతున్నట్లు తెలిపారు.



సినీ హీరో విజయ్ దేవరకొండకు తిలకం దిద్దుతున్న ఆలయ అర్చకులు



వేదాశీర్వచనంలో కూర్చున్న సినీ హీరోలు విజయ్, ఆనంద్, కుటుంబ సభ్యులు, ఖుషి సినిమా టీం

విప్ సునీత స్వాగతం..

స్వామి వారి దర్శనానికి వచ్చిన నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండతో పాటు ఖుషి సినిమా సభ్యులను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్. గీత, ఆలయ పర్యవేక్షకులు రఘు, రాజన్‌బాబు, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్ దేవరకొండను చూసేందుకు ఎగబడుతున్న ఫ్యాన్స్

ఫ్యాన్స్ కేరింతలు..

విజయ్ దేవరకొండను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. ప్రధానాలయ వద్దకు చేరుకోగానే భక్తులు కేరింతలు కొడుతూ అర్జున్‌రెడ్డి అంటూ పిలిచారు. భక్తులను, అభిమానులను కంట్రోల్ చేసేందుకు పోలీసులు యత్నించారు. దర్శనం చేసుకునేందుకు ముఖ మండపంలోకి వెళ్లిన సమయంలో, దర్శనం అనంతరం ఉత్తర రాజగోపురం నుంచి బయటకు వచ్చిన సందర్భాల్లో భక్తులు, అభిమానులు పెద్ద ఎత్తున ఈలలు వేసి, సెల్ఫీలు దిగారు.



ఆలయ మాడవీధుల్లో విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, ఈఓ గీతారెడ్డి

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారంతో పాటు శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో నిండిపోయాయి. శ్రీస్వామి వారి ధర్మదర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ. 43,23,900 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



ప్రధానాలయంలోని క్యూలైన్‌లో భక్తులు

నేడు నల్లగొండకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

నల్లగొండ టూ టౌన్ : కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సోమవారం నల్లగొండ పట్టణానికి రానున్నారు. బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు అంత్యక్రియల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయనతోపాటు పలువురు రాష్ట్ర నాయకులు కూడా హాజరు కానున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



శివ (ఫైల్)

నాగారం: సూర్యాపేట–జనగాం జతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగారం మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన నడిపల్లి హరీష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడు ఉప్పుల శివ(22) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వివరాలు.. ఈటూరు గ్రామానికి చెందిన నడిపల్లి హరీష్, ఉప్పుల శివలు ఆగస్టు 29న బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఫణిగిరి స్టేజి వద్ద సూర్యాపేట వైపు నుంచి వస్తున్న కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హరీష్ అక్కడిక్కడే మృతిచెందగా, ఉప్పుల శివ తీవ్రంగా గాయపడి గత 5రోజులుగా హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం ఈటూరుకు తరలించినట్లు ఎస్ఐ జి. ముత్తయ్య తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే కీలకం

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

బీబీనగర్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు చాలా కీలకమని, అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర్ రావు కోరారు. బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి, చిన్నరావులపల్లి, జంపల్లి, భట్టుగూడెం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటరు నమోదును పరిశీలించారు. ఎవరైనా మరణించి ఉంటే కుటుంబ సభ్యుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రం ఫారం–7 ద్వారా నమోదు చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే స్వయంగా వెళ్లి పరిశీలించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ వెంకటరెడ్డి ఉన్నారు.

భువనగిరి : వలిగొండలోని 250, 251, 252, 253 పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సందర్శించి ఓటరు నమోదను పరిశీలించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా, అర్హులంతా ఓటరుగా నమోదయ్యేలా చూడాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



బీబీనగర్: చిన్నరావులపల్లిలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

పొరపాట్లకు తావుండొద్దు

బొమ్మలరామారం : మండలంలోని రామలింగంపల్లి, రంగాపూర్, బొమ్మలరామారంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి సందర్శించారు. ఓటరు నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులను పరిశీలించి బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రామానుజాచార్యులు, ఏఎస్ఓ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురికి గాయాలు
- 28 మందిపై కేసు నమోదు

హుజూర్‌నగర్: పట్టణంలో ఆదివారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కాలేజీ సమీపంలో నివాసముంటున్న మద్దెల బాలస్వామి, శీలం పోలయ్య కుటుంబాలు శుభకార్యాలకు మండపాల డెకరేషన్‌లు చేస్తుంటారు. గత నెల 31న ఇరు కుటుంబాలకు చెందిన వారు వేర్వేరుగా వైన్స్ వద్ద మద్యం తాగుతుండగా గొడవ జరిగింది. ఇది మనసులో పెట్టుకుని ఇరువర్గాల వారు ఈ నెల 1వ తేదీన మళ్లీ గొడవ పడ్డారు. కాగా ఆదివారం ఇరువర్గాలు పంచాయితీ పరిష్కారం చేసుకునేందుకు మాట్లాడుకుంటుండగా.. మాటా మాట పెరిగి ఘర్షకు దారి తీసింది. ఈ దాడిలో ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేసి గాయాలైన వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాలు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు 28 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

ఉన్నత చదువులకు సాయం అందించరూ

- భర్త మృతితో కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్న తల్లి
- హాస్టల్ ఫీజు, ల్యాప్‌టాప్ కొనేందుకు ఇబ్బందులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



కుమారుడు, కుమార్తెతో విజయలక్ష్మి

అర్వపల్లి: ఆ కుటుంబ పెద్ద అకాల మరణంతో కుటుంబ భారమంతా భార్య పైనే పడింది. దీంతో కూలీ పనులకు వెళ్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తుంది. తన పిల్లల ఉన్నత చదువులు ఆగకుండా దాతలు సాయమందిచాలని కోరుతోంది. వివరాలు.. జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల వెంకటయ్య ఏడాదిన్నర కిందట అకాల మరణం చెందారు. వెంకటయ్య మృతితో ఆ కుటుంబం కష్టాల్లో పడింది. ఆయన భార్య విజయలక్ష్మి కూలీ పనులకు వెళ్తూ పిల్లలను చదివిస్తుంది. వారి కూతురు సుధాపరిమళ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతుండగా.. కుమారుడు సూర్యప్రకాశ్ హైదరాబాద్‌లోనే బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే విజయలక్ష్మి కూలీ పనులకు వెళ్లి పిల్లలను ఉన్నత చదువులు చదివించడం ఇబ్బందిగా మారింది. సుధాపరిమళకు ల్యాప్‌టాప్ అవసరముందని, కానీ తన చేతిలో చిల్లిగవ్వ లేదని ఆ తల్లి వాపోతుంది. అలాగే ఇద్దరు పిల్లలకు హాస్టల్ ఖర్చులకు, ఫీజులు చెల్లించడం కూడా ఆమెకు భారంగా మారింది. దాతలు సాయమందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తోంది. అదేవిధంగా తన కుటుంబానికి గృహలక్ష్మి పథకం కింద ఇల్లు మంజూరు చేయడంతో పాటు దళిత బంధు అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతుంది.

సాయం చేయాలనుకునే దాతలు :
వేముల విజయలక్ష్మి
బ్యాంక్ అకౌంట్ : 41751729556
ఎస్‌బీఐ, జాజిరెడ్డిగూడెం
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0008808
ఫోన్ నంబర్ : 7569635408

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

భువనగిరి: గుర్తుతెలియని దుండగులు మహిళను కత్తితో బెదిరించి మూడున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఈ ఘటన వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్రవోని లింగమణి తన వ్యవసాయ బావి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా ప్రొద్దటూరు గ్రామం దారి నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడపై కత్తి పెట్టి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. వెంటనే లింగమణి దక్షిణాఫ్రికా దేశంలో ఉంటున్న తన భర్తకు ఫోన్ చేయగా.. ఆయన వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ చేశాడు. గ్రామస్తులు ఈ మెసేజ్ చూసి ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు వలిగొండ ఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ మొగిలయ్య, పోలీసు సిబ్బంది

గొర్రెల మందపై నుంచి వెళ్లిన లారీ

- 8 గొర్రెలు మృత్యువాత

పెద్దవూర: మండలంలోని ముసలమ్మచెట్టు స్టేజీ గ్రామంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై వెళ్తున్న గొర్రెల మందపై నుంచి లారీ వెళ్లడంతో ఎనిమిది గొర్రెలు మృత్యువాత పడగా, మరో ఐదింటికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన కోనపురి రాములు తనకు ఉన్న గొర్రెలను మేపటానికి ఐదు నెలల క్రితం సాగర్ ఆయకట్టు ప్రాంతానికి తోలుకుని వెళ్లాడు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతుండటంతో గొర్రెలను మేపుకుంటూ తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గొర్రెల మందతో వెళ్తుండగా పెద్దవూర మండలంలోని ముసలమ్మచెట్టు గ్రామం వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ గొర్రెల మందపై నుంచి వెళ్లింది. దీంతో మందలోని ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఐదు గొర్రెలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న గ్రామస్తులు లారీని వెంబడించి అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



మృతిచెందిన గొర్రెలు

టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి



గూడూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిన వాహనాలు

బీబీనగర్: మండల పరిధిలోని హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. గ్రామాల్లో బోనాల పండుగలు ఉండడం, యాదాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు ఈ రహదారి గుండా తరలిరావడంతో అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగాయి. దీంతో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో టోల్‌ప్లాజా వద్ద వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

చీటింగ్ కేసులో ఆరుగురు అరెస్ట్

మర్రిగూడ: గౌతమ్ ఈగల్స్ స్కీంలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో ఎక్కువ లాభం పొందవచ్చని ప్రజలను నమ్మిస్తూ కమీషన్ కోసం ఏజెంట్లుగా వ్యవహరించిన ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కె.రంగారెడ్డి తెలిపారు. హైదరాబాద్ గౌతమ్ ఈగల్స్ స్కీంలో మధ్యవర్తులుగా వ్యవహరించిన మర్రిగూడ మండలానికి చెందిన పంతంగి సుధాకర్, సురిగి రమేష్, వీరమళ్ల రమేష్, కుంభం రవి, ఎరుకల అశోక్, కుందారపు శంకర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ స్కీమ్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టి మోసోయిన బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఇలాంటి స్కీంలను ప్రజలు నమ్మవద్దని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ కోదాడ పట్టణంలో గల విజయవాడ రోడ్ బైపాస్‌లో గల బృందావన్ నగర్ వెంచర్‌లో 222 గజాల ప్లాట్ అమ్మబడును. సంప్ర।। 8977786505 [Y-784380]

Wanted

■ నల్లగొండ కలెక్టరేట్ ప్రక్కన ఇండియన్ ఆయిల్ బంక్‌లో పని చేయుటకు పంప్ బాయ్స్ మరియు గర్ల్స్ కావలెను. సంప్ర।। 97033 33310 [YA-14992]

■ నల్లగొండ పట్టణం దేవరకొండ రోడ్డులో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు లేడి కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర।। సెల్: 7680038452 [Y-772543]

■ అర్జెంట్‌గా లేడీస్ హాస్టల్‌లో వంట చేయుటకు ఎలాంటి ఆధారం లేని యువతి కావలెను. మంచి భోజనం, వసతి కల్పించి జీతం :10,000 ఇవ్వబడును. ఆసక్తి గల వారు సంప్ర।। 7569658703 [Y-784272]


■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సరైన మెళకువలతో ‘బత్తాయి’లో అధిగ దిగుబడి

- నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి



గుర్రంపోడు: బత్తాయి తోటల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటిస్తే అధిగ దిగుబడి పొందవచ్చునని నల్లగొండ ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. బత్తాయి తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

లేత తోటలు

బత్తాయి తోటల్లో మంచి యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే 5వ సంవత్సరం నుంచి కాయలు కాస్తాయి. తోటలను దున్నడం, పాదులు తవ్వడం, ఎండు పుల్లలను తొలగించడం లాంటివి చేయాలి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నీటి తడులను ఆపి చెట్లు వాడుకు గురయ్యేటట్టు చేయాలి. ప్రతి చెట్టుకు 40కిలోల పశువుల ఎరువు లేదా 10కిలోల వర్మీ కంపోస్టు, మూడున్నర కిలోల ఆముదము లేదా వేప పిండి, 600 గ్రాముల యూరియా, 900 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫెట్, 400 పొటాష్‌ను కలిపి పాదంతా సమంగా వేసి నీటి తడులు ఇచ్చిన లేదా మంచి వర్షం పడిన చెట్లు పూతకు వస్తాయి. ఈ పూత నుంచి వచ్చే కాయలు మే మాసంలో కోతకు వస్తాయి. ఈ కాపు నిలబడాలంటే డిసెంబర్, జనవరి మాసాల్లో చెట్లను వాడుకు గురిచెయ్యకుండా నీటిని అందించాలి. అయినప్పటికీ రుతు క్రమాన్ని బట్టి చెట్లలో కొంత పూత వస్తుంది. ఆ పూత తక్కువగా ఉంటుంది. వర్షాకాలంలో కాయలు వస్తాయి. దీని వల్ల వేసవిలో అధిక పంట, వర్షాకాలంలో సీజన్ పంట తక్కువగా వస్తాయి. ఇలా ఒకటి, రెండు సంవత్సరాలు అలవాటు చేసుకుంటూ పోతే చెట్లు ఈ పద్ధతికి అలవాటు పడతాయి. ఎండాకాలం పంట ఎక్కువగానూ వర్షాకాలం పంట తక్కువగానూ వచ్చి రైతులకు రాబడులు పెరుగుతాయి.



నీటి తడులకు సిద్ధంగా ఉన్న బత్తాయి తోట

ముదురు తోటలు..

ప్రస్తుతం కాపునిస్తున్న ముదురు తోటల్లో వేసవి పంట పెంచేందుకు 50కిలోల పశువుల ఎరువు, 5కిలోల వేప పిండి లేదా ఆముదం పిండి, 750 గ్రాముల యూరియా, 1200 గ్రాముల సింగిల్ సూపర్ పాస్ఫెట్, 500గ్రాముల పొటాష్‌ను ప్రతి చెట్టుకు వేసి నీరందించాలి. కొత్తగా వచ్చిన చిగురు, రెమ్మలను పురుగుల బారి నుంచి కాపాడుకునేందుకు లీటర్ నీటికి 1.5 మిల్లీలీటర్ల మోనో ప్రోటోపాస్ మందును పిచికారీ చేయాలి. సూక్ష్మపోషక లోపాలను సవరించేందుకు 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 2 గ్రాముల మాంగనీస్ సల్ఫేట్, 2 ఫెర్రస్ సల్ఫేట్, 1 గ్రాము బోరాక్స్, 6 గ్రాములు సున్నం, 10 గ్రాముల యూరియాను లీటర్ నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో ద్రావణాన్ని రెండు సార్లు చెట్లపై పిచికారీ చేయాలి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 10 –15 రోజులు సాధారణంగా వర్షాలు పడకుండా వచ్చే వరపును సద్వినియోగం చేసుకోవాలి. ఈ వేసవి కాపు చెట్టుపై ఉన్నందున జనవరిలో మళ్లీ చెట్లను వాడుకు తెగదు. సాధారణంగా వచ్చే పంటను మాత్రమే తీసుకోవాలి.

సరైన యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ

ఉమ్మడి జిల్లాలో గతంలో రెండు లక్షల ఎకరాల్లో బత్తాయి తోటలు సాగవుతూ దేశంలోనే బత్తాయి సాగులో ప్రథమ స్థానంలో ఉండగా.. క్రమంగా 48,876 ఎకరాలకు పడిపోయింది. బత్తాయి సాగుకు సరైన అంటు మొక్కలు ఎంపిక చేసుకోకపోవడం, యాజమాన్య పద్ధతుల్లో లోపాల వల్ల తోటలు విపరీతంగా క్షీణించిపోతున్నాయి. ఇప్పటికే 40శాతం తోటలు దెబ్బ తినడం, తెగుళ్లతో క్షీణించినట్లు అంచనా. దీంతో గత రెండు మూడేళ్లుగా ఎకరం బత్తాయి తోట నుంచి 10మెట్రిక్ టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా ఐదు టన్నుల దిగుబడి కూడా రావడం లేదు.

గజ్జి తెగులు: ఈ తెగులు బత్తాయి, నిమ్మ తోటలకు వర్షాకాలంలో ఎక్కువగా సోకుతుంది. గజ్జి మచ్చలు ఆకులు, కొమ్మలు, ఆకు తొడిమలపై ఏర్పడతాయి. మొట్టమొదట ఆకులపై చిన్న పసుపుపచ్చని మచ్చలుగా ఈ గజ్జి ఏర్పడుతుంది. ఈ మచ్చల చుట్టూ పసుపుపచ్చని వలయాలు ఏర్పడతాయి. కాయల మీద, పండ్ల మీద గజ్జి మచ్చలు ఏర్పడుతాయి. గజ్జి మచ్చల్లో పగుళ్లు కన్పిస్తాయి. ఈ గజ్జి వల్ల కాయలు తొందరగా రాలిపోతాయి. గజ్జి సోకిన కాయలు నాణ్యతను కోల్పోతాయి. వర్షపు జల్లులు తెగులుకు కారణమైన బ్యాక్టీరియా వ్యాప్తికి దోహదం చేస్తాయి.

నివారణ: గజ్జి తెగులు సోకిన ఎండు కొమ్మలను కత్తిరించి నాశనం చేయాలి. 10 లీటర్ల నీటిలో 1 గ్రాము సెప్టోసైక్లిన్ మరియు 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును వర్షాకాలంలో 20 రోజులకు ఒకటి రెండుసార్లు పిచికారీ చేయాలి.

తోటల క్షీణతకు కారణాలు ఇవీ : నాణ్యమైన బత్తాయి అంటుమొక్కలు ఎన్నుకోకపోవడం. సమగ్ర ఎరువులు, నీటి యాజమాన్య లోపం, కేవలం రసాయనిక ఎరువులు వాడటం. అంటు మొక్కలు నాటేటప్పుడు అంటు కలయిక భాగం నేలమట్టానికి దగ్గరగా నాటడం. బల్లాకు తెగులు సోకడం. పచ్చిరొట్ట ఎరువులు వాడకపోవడం. వేరుకుళ్లు తెగులు సోకి చెట్టు క్షీణించడం.

కాయ తొడిమ తెగులు: మొదట తొడిమకు దగ్గరగా కుళ్లు మచ్చ ఏర్పడుతుంది. మచ్చ వక్క రంగులో తొడిమ చుట్టూ కాయపై ఏర్పడుతుంది. క్రమంగా ఈ మచ్చ కాయంతా వ్యాపించి లోపలి భాగాలు కుళ్లి మెత్తబడతాయి. తెగులు సోకిన కాయలు రాలిపోవడం గాని లేదా ఎండి చెట్లు అంటిపెట్టుకుని ఉంటాయి.

నివారణ: తెగులు నివారణకు వర్షాకాలంలో నెలకొకసారి 1 గ్రాము కార్బండిజమ్ మందును ఒక లీటర్ నీటికి కలిపి కాయలు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

దోమకాటు: బత్తాయి పండ్లు పక్వానికి వచ్చే దశలో దోమలు రాత్రిపూట కాయలపై కాటు వేసి రసాన్ని పీల్చడం వల్ల విపరీతమైన నష్టం ఏర్పడుతుంది. ఆశించిన పండ్లు కుళ్లి రాలిపోయి, వేళ్లతో వత్తితే రసం బయటికి చిమ్ముతుంది. దోమకాటు వేసిన రంధ్రం చుట్టూ కాయ మెత్తబడి శిలీంధ్రాలు, బ్యాక్టీరియా ప్రవేశించడం వల్ల కాయ కుళ్లిపోతుంది.

నివారణ: తోటల్లో రాత్రి పూట లైట్లు పెట్టి తోటల్లో అక్కడక్కడ ప్లేట్లలో మలాథీయాన్ ఒక మిల్లీలీటరు మందును ఒక శాతం చక్కెర, పండ్లరసంతో కలిపి విషపు ఎరను ఉంచాలి. వెలుతురుకు దోమలు ఆకర్షించబడి మిశ్రమాన్ని పీల్చి చనిపోతాయి.